క్లుప్తంగా

రక్తదానంతో జీవదానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానం మహాదానమని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి. లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదానం కార్యక్రమాన్ని గురువారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణస్వామి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయటం ద్వారా మరో ప్రాణాన్ని నిలబెట్టిన వారవుతారని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. శ్రీకాంత్ రెడ్డి నిర్వహించగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో తనిఖీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులో నాకాబందీ నిర్వహించింది. ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. భానూనగర్ జంక్షన్ వద్ద రూ. 12లక్షల నగదును తనిఖీలలో గుర్తించారు. దీంతో ఐటీ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందజేశారు. తాము బ్యాంకు సిబ్బంది అని బ్యాంకు పనిమీద నగదు తీసుకువెళ్తున్నట్లు వారు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి లత వారితో పాటు బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. సదరు నగదు బ్యాంకుకు సంబంధించినదేనని పత్రాలు చూపించారు. దీంతో నగదును బ్యాంకు సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారం నగదును తీసుకువెళ్లలేటప్పుడు దానికి సంబంధించిన పత్రాలు తప్పకుండా తీసుకువెళ్లాలని ఆమె సూచించారు.

డాక్టర్ బషీర్‌కు సర్జన్ ఆఫ్ ది డికేడ్ అవార్డు



డాక్టర్ బషీర్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): దశాబ్ద కాలంగా పేద, మధ్య తరగతి ప్రజలకు అధునాతన ఫేకో, లేసిక్ సర్జరీలు 35 వేలకు పైగా నిర్వహించి కంటి చూపును ప్రసాదించినందుకు గాను అయాన్ ఐ ఆస్పత్రి అధినేత డాక్టర్ బషీర్ అహ్మద్ మయాఖ్ సర్జన్ ఆఫ్ ది డికేడ్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రఖ్యాత గీతా విజన్ ట్రస్టు ఏప్రిల్ 7న నిర్వహించే ఉగాది పురస్కారాలు 2024లో డాక్టర్ బషీర్‌కు ఈ అవార్డును అందజేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు పొక్కులూరి సుబ్బారావు తెలిపారు. శాశ్వత అంధత్వానికి దారితీసే పరిస్థితుల్లో ఉన్న రోగులు ఎందరికో వెలుగులు నింపినట్లు తెలిపారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచుకుని తగు చికిత్స అందించటం ద్వారా డౌన్‌సిండ్రోమ్ పిల్లలు కూడా మెరుగైన జీవనం సాగించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు, చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణకుమారి అన్నారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణసంస్థ కార్యాలయంలో గురువారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినాన్ని పురస్కరించుకుని అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డౌన్ సిండ్రోమ్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలకు సహజంగా హృదయ, కాలేయం, థైరాయిడ్, ఊపిరితిత్తులు, కంటి, దంత సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం గరుడ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎస్‌జె. సిద్ధార్థ, డాక్టర్ హర్షిత, పి. బాలాజీ తదితరులు చిన్నారులు వారి తల్లిదండ్రులను ఉచితంగా పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

భవిత కేంద్రానికి కంప్యూటర్ల వితరణ

ఇబ్రహీంపట్నం: స్వర్ణ టోల్‌వే సంస్థ ఆధ్వర్యంలోని స్థానిక భవిత కేంద్రానికి రూ.15 లక్షల సీఎస్ఆర్ నిధులతో 15 కంప్యూటర్లు, 15 ప్రింటర్లు, 19 ట్రంపోలిన్స్ (దివ్యాంగుల పరికరాలు) గురువారం అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు కిరణ్‌బాబు, కార్యదర్శి రమణసాయి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం పొందేందుకు రూ.15 లక్షలతో ఈ పరికరాలు అందించామన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు సీహెచ్ పుష్పలత, శ్యామ్‌బాబు, డీజీఓ రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా ఐడీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తలమానికంగా 34వ డివిజన్



కేదారేశ్వరపేటలో నిర్మించిన సీసీ రోడ్డు



నాడు-నేడు కార్యక్రమం ద్వారా రూపురేఖలు మారిన లక్షణదత్తు పాఠశాల

స్థానిక 34వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండింటిలోనూ అగ్రభాగాన నిలుస్తూ మోడల్ డివిజన్‌గా రూపుదిద్దుకుంటోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పలు దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు కొత్త ప్రాజెక్టుల రాకతో డివిజన్ కళకళలాడుతోంది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా కేదారేశ్వరపేటలోని లక్షణదత్తు ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేయడంతో గతంలో పదుల సంఖ్యలో ఉండే విద్యార్థుల సంఖ్య నేడు వందల సంఖ్యకు చేరుకుంది. ఎర్రకట్ట నుంచి మీసాల రాజారావు బ్రిడ్జి వరకు సీసీ రోడ్డును నిర్మించడంతో పాటు ఖుద్దూస్‌నగర్ ఆరు పంపుల బావి, కేదారేశ్వరపేటలో సీసీ రోడ్డు, కేదారేశ్వరపేటలో ఉద్యానవనం వంటివి ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ)



సరికొత్త లుక్‌లో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన పార్కు

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి



ఎస్సీ సెల్ నూతన కమిటీ సభ్యులను సత్కరించి అభినందిస్తున్న ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యతను తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్‌కు నూతనంగా నియమితులైన అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి తాండ్ర ఇంద్రకుమార్, కార్యదర్శులు మద్దిరాల కమలాకర్, చేపూరి శ్రీను, జాయింట్ సెక్రటరీ రుద్రశంకర్, పచ్చిగళ్ల రమేష్, థామస్ గురువారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వెళ్లి ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ వారికి శాలువాకప్పి చిరుసత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని అన్నారు. పదవులు పొందినవారు వారివారి ప్రాంతాల్లోని ప్రజలతో కలిసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో అధికారంలోకి తీసురావాలని కోరారు.ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ బాబు మాట్లాడుతూ తమ మీద నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఆసిఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి తమ వంతు కృషి చేసి మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామని చెప్పారు.

ముస్లింల అభ్యున్నతికి 'కూటమే' అడ్డంకి

వైఎస్సార్ సీపీ వెస్ట్ అభ్యర్థి షేక్‌ఆసిఫ్



ఇఫ్తార్‌లో పాల్గొన్న షేక్ ఆసిఫ్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీల అభ్యున్నతిని అడ్డుకోవటమే తెలుగుదేశం పార్టీ కూటమి లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆరోపించారు. భవానీపురం పోలీసు కాలనీలోని పెద్ద మసీదులో గురువారం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఆసిఫ్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌ను స్వీకరించారు. అనంతరం అక్కడ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీదు బయట ఆయనను కలిసిన మీడియాతో మాట్లాడారు. ముస్లిం మైనార్టీలను అణిచివేసే లక్ష్యంతోనే టీడీపీ కూటమి రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. టీడీపీ కూటమికి ముస్లిం మైనార్టీలు పూర్తిగా వ్యతిరేకమన్నారు. ముస్లింల రిజర్వేషన్ల రద్దు, ముస్లిం సంక్షేమం రద్దు అజెండాతో బీజేపీ, జనసేన కూటమి తెలంగాణలో పని చేశాయన్నారు. ఆ పార్టీలతో నేడు ఏపీలో టీడీపీ పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో పాల్గొంటుందన్నారు. ఇటువంటి ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా ఉన్న కూటమికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో రాజ్యాంగం వివరిస్తున్న లౌకిక వాదానికి తూట్లు పొడిచే ఈ విధమైన కూటమిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న కాలంలో ఈ విధమైన కూటమి వలన దేశానికి ప్రమాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు నాహిద్, స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్య, అంతజుమన్ సంస్థ కార్యదర్శి బషీర్ నాయకులు, అమనుల్లా, బాజీ బాబా, సుభాని, యునస్, గౌసి, కాజా, అలీ, అజీజ్, జీఎంసీ అత్తాఫ్, బాషా, నజీర్, కరిముల్లా, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి



భరత్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): త్వరలో జరిగే అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి పి. భరత్‌కుమార్ ఎంపికైనట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఏషియన్ యూనివర్సిటీస్ పవర్‌లిఫ్టింగ్ కప్ చాంపియన్‌షిప్ మే ఐదు నుంచి 11వ తేదీ వరకూ హాంకాంగ్‌లో జరగనున్నట్లు పేర్కొన్నారు. అందులో భారతదేశం పక్షాన తమ కళాశాల విద్యార్థి పి. భరత్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. దానికి అయ్యే ఖర్చు సుమారు రూ.1.50 లక్షల వ్యయాన్ని కళాశాల పక్షాన భరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని విద్యార్థి భరత్‌కుమార్‌కు గురువారం కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం విద్యార్థులను అభినందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కె. రామకృష్ణ, క్రీడా విభాగాధిపతి డి. హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఉత్సాహంగా సాగిన ఇన్‌కెండో–2కే24



మాట్లాడుతున్న సవీష్ వర్మ



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కామర్స్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజయవాడ సెంట్రల్ సర్కిల్ ఇన్‌కమ్ ట్యాక్స్ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి. సవీష్ వర్మ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో ఇన్‌కెండో–2కే24 పేరుతో కామర్స్ చదువుతున్న విద్యార్థులకు కామర్స్ కోర్సునకు సంబంధించిన అంశాలతో పాటుగా సాంస్కృతిక అంశాల్లో పోటీలను గురువారం జరిగాయి. సవీష్ వర్మ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గొప్ప విజయాలు సాధించిన వారి జీవిత పుస్తకాలను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకతతో పాటుగా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కామర్స్ విభాగాధిపతి కె.నారాయణరావు, సిద్ధార్థ అకాడమీ సభ్యుడు లలిత్ ప్రసాద్ ప్రసంగించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు..

సభ అనంతరం జరిగిన పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిసెస్, డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్(విజయవాడతూర్పు): సుదూర ప్రాంతాలు ప్రయాణించే వారి సమస్యలను పరిష్కరించేందుకు గాను శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆటోనగర్ ఆర్టీసీ డీఎం కె. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225463కి ఫోన్ చేసి సమస్యలు.. సలహాలను తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురంలోని ఏపీ ట్రాన్స్ కో 132 కేవీ ఉపకేంద్రం ఆధునికీకరణలో భాగంగా కొన్ని మార్పులు చేయవలసి ఉన్నందున శుక్ర, శనివారాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 33 కేవీ లైన్లలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీపీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కానీ అత్యవసర పరిస్థితి ఉత్పన్నం అయితే మాత్రమే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భావాల వర్ణనే కవిత



లబ్బీపేట(విజయవాడతూర్పు): మనసులో మెదిలే భావాలను కళాత్మక రూపంలో వర్ణించేదే కవిత అని తెలుగు కవి, రచయిత డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ మహిళా కళాశాల ఎన్‌డీఎల్ఐ క్లబ్, విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థునులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కవితా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ సమస్త మానవాళి అంగీకరించిన గొప్ప పద్ధతుల్లో కవిత్వం ఒకటిగా పేర్కొన్నారు. మరో అతిథి కేఎల్ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ చౌడరాజు మాట్లాడుతూ భాషా భిన్నత్వాల్ని కవితా ప్రచారం ద్వారా ఏకం చేసేందుకు యునెస్కో ఏటా మార్చి 21న కవితా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి పోలీస్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఓ కారులో 100 గ్రాములతో వెళ్తున్న ముగ్గురిని బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన పవన్ కుమార్, శివప్రసాద్ చిట్టి, పునీత్‌గౌడ్ కారులో ప్రయాణిస్తూ గుంటుపల్లి చెక్‌పోస్టు వద్దకు వచ్చారు. ఎస్ఐ అనూష ఆ చెక్‌పోస్ట్ వద్ద కారును తనిఖీచేశారు. కారులో వంద గ్రాముల గంజాయి లభించడంతో ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

దారి కాచి దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారులో ప్రయాణిస్తున్న వారిని దారి కాచి దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పైపుల రోడ్డులోని శాంతినగర్‌కు చెందిన ధార్వత్తు కరుణ, రాజునాయక్‌లు భార్యభర్తలు. కరుణ వీఎంసీలో ఆర్‌పీగా విధులు నిర్వర్తిస్తోంది. ఈ నెల 17వ తేదీన కరుణ తన భర్తతో కలిసి కారులో మైలవరం బయలుదేరింది. కారు కొంత దూరం వచ్చిన తర్వాత బైక్‌పై ముగ్గురు వ్యక్తులు కారును వెంబడించారు. కారును మార్గమధ్యలో ఆపి కరుణ, రాజునాయక్‌లపై దాడి చేశారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరు మగవారు, ఒక మహిళ ఉన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు


చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు కొండ ప్రాంతానికి చెందిన లోడ్డు రమణ, రాజారావులు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా చిన్న కుమార్తె సౌఖ్యత(19) వన్‌టౌన్‌లోని మెడికల్ షాపులో పని చేస్తుంటుంది. ఈ నెల 20వ తేదీ తన స్నేహితురాలికి పాప పుట్టిందని చెప్పి బయటకు వెళ్లిన సౌఖ్యత సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు

- ఆలయ ప్రాంగణంలో కూల్‌పెయింట్
- గోశాల వద్ద కాయర్ మ్యాట్
- త్వరలో చలువ పందిళ్ల నిర్మాణం



గోశాల వద్ద ఫుట్‌పాత్‌పై కాయర్ మ్యాట్



ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవి ఎండ నుంచి భక్తులకు ఉపశమనం కలిగేలా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు కాళ్లు కాలకుండా పలు చోట్ల కూల్ పెయింట్‌ను ఇప్పటికే వేశారు. ఘాట్‌రోడ్డులో ఓం టర్నింగ్ నుంచి చిన్న గాలి గోపురం వరకు, స్కానింగ్ పాయింట్ నుంచి మహా మండపం వరకు, ఇటు మహా మండపం లిఫ్టు నుంచి మహామండపం వరకు కూల్ పెయింట్ వేశారు. ఇక కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు గోశాల వైపున కాయర్ మ్యాట్‌ను వేసి భక్తులకు ఉపశమనం కల్పించారు. మరో వైపున ఎండ తీవ్రత ఎక్కువైనా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి ఇప్పటికే ఆలయ ప్రాంగణానికి తరలించారు. మరో మూడు, నాలుగు రోజులలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

సైన్స్ వల్లనే మనిషికి సౌకర్యాలు

- సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్
- సిద్ధార్థలో ముగిసిన ఫిజిక్స్, కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ సదస్సు



మాట్లాడుతున్న బీఎల్‌వీ ప్రసాద్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుతం మనిషి అనుభవిస్తున్న సౌకర్యాలు అన్ని సైన్స్ ప్రసాదించిన కానుకలేనని బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబినార్ హాలులో సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు గురువారం సాయంత్రంతో ముగిసింది. ఈ సదస్సులో ప్రసాద్ మాట్లాడుతూ మన నిత్య జీవితంలో ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి పని సైన్స్‌తో ముడిపడి ఉంటుందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆశోక్ కె.గంగూలీ మాట్లాడుతూ విదేశాల్లో మంచి విశ్వవిద్యాలయాల్లో చదువుకుని దేశానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ప్రొఫెసర్ బీవీఆర్ టాటా మాట్లాడుతూ నానో టెక్నాలజీ వల్ల మనిషి జీవనం చాలా సౌకర్యవంతంగా మారిందన్నారు. సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ప్రొఫెసర్ కేఎల్ మోహనరావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇలాంటి సదస్సు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గుంటుపల్లిలో పోలీసుల కవాతు

ఇబ్రహీంపట్నం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గుంటుపల్లి గ్రామంలో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. వెస్ట్‌జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన సుమారు 100 మంది సివిల్, ఏఆర్, పారామిలటరీ బలగాలతో గుంటుపల్లి సెంటర్ నుంచి ఖాజీపేట మీదుగా ఎంపీపీ పాఠశాల వరకు ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. వెస్ట్‌జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన ఓటు వినియోగానికి పోలీసులు రక్షణ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.